క్లుప్తంగా

ఘనంగా చండీయాగం



చండీయాగం చేస్తున్న భక్తులు

పాలకొండ: స్థానిక జగన్నాథస్వామి ఆలయం ఆవరణలో బుధవారం ఘనంగా చండీయాగం నిర్వహించారు. భవానీ దీక్షలు చేపట్టిన భక్తుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు శర్మ యాగం చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ యాగంలో పాల్గొన్నారు.

ఎల్విన్‌పేట ఎస్సై బాధ్యతల స్వీకరణ



ఎస్సైగా విధుల్లో చేరిన శివప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట ఎస్సైగా బి.శివప్రసాద్ బుధవారం విధుల్లో చేరారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఎల్విన్‌పేటలో ఎస్సైగా పనిచేసిన షన్ముఖరావుకు కురుపాం బదిలీ కావడంతో ఆయన స్థానంలో పాలకొండలో పనిచేస్తున్న శివప్రసాద్‌కు ఎల్విన్‌పేటకు బదిలీ అయింది. ఈ మేరకు విధుల్లో చేరిన శివప్రసాద్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

అంగన్వాడీల నిరసన



మానవహారం చేపట్టిన అంగన్వాడీలు

పాలకొండ: అంగన్వాడీ కార్యకర్తల సమ్మెలో భాగంగా బుధవారం వీరఘట్టం జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన చేపట్టారు. అనంతరం భిక్షాటన చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్‌లు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని యూనియన్ నాయకులు ఎన్.హిమప్రభ, బి.అమరవేణిలు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

పాలకొండ: నగరపంచాయతీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు దావాల రమణారావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన నగరపంచాయతీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అందించాలని, ప్రభుత్వం తమ డిమాండ్‌లు పరిష్కరించక పోతే ఈ నెల 26నుంచి సమ్మె చేపడతామని స్పష్టం చేశారు.

గర్భిణులు, బాలింతల పోషకాహారంపై ఆరా



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో గీతాంజలి

సీతంపేట: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం సక్రమంగా అందుతున్నదీ, లేనిదీ ఎంపీడీవో కె.గీతాంజలి బుధవారం ఆరా తీశారు. ఈ మేరకు మండ గ్రామాన్ని సందర్శించిన ఆమె పోషణ కిట్లు ఎవరికైనా అందకపోతే గ్రామ సచివాలయం సిబ్బంది, వీవో ఎస్‌హెచ్‌జీ అందజేస్తారని చెప్పారు. మహిళా పోలీస్, ఏఎన్ఎంలు విజిట్ చేస్తున్నారా? లేదా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

పేదలకు ఆరోగ్యశ్రీ ఓ వరం

పార్వతీపురంటౌన్: పేదలకు ఆరోగ్యశ్రీ ఓ వరమని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పట్టణంలో జరిగిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంతోమంది పేదల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపిందన్నారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ సేవలు వర్తింపజేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితిని రూ.25లక్షలకు పెంచిందన్నారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం శ్రద్ధచూపడం అభినందనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతిలేని సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే కళావతి
- నడుకూరులో గడపగడపకు మన ప్రభుత్వం



గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కుంబురుక దీనమయ్య

వీరఘట్టం/పాలకొండ: అవినీతి లేని సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో అందిస్తోందని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఈ మేరకు మండలంలోని నడుకూరులో బుధవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాల గురించి ఆరాతీశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. గ్రామ వలంటీర్‌లు, గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటివద్దకే పథకాలు అందుతున్నాయని చెప్పారు. గత టీడీపీ పాలనకు ఈ ప్రభుత్వ పనితనానికి తేడాను ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శమని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అధికారులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.



సీతంపేట: వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ తదితరులు

రెల్లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రెల్ల గ్రామంలో ఎంపీపీ కరంబురుక దీనమయ్య ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమం జరిగింది. పార్టీ శ్రేణులంతా పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.

కుడ్డపల్లిలో..

సీతంపేట: మండలంలోని కుడ్డపల్లిలో వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దళాయి పేటలో..

కొమరాడ: మండలంలోని దళాయిపేట సచివాలయం వద్ద బుధవారం వైస్సార్‌సీపీ మండల కన్వనర్ ద్వారపురెడ్డి జనార్దన రావు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారపురెడ్డి జనార్దన రావు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు.వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎం చేయాలని కోరారు. సచివాలయ వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును అవిష్కరించారు. కార్యక్రమంలో వైస్సార్‌సీపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పోస్టర్ ప్రెజెంటేషన్‌లో విద్యార్థికి ప్రథమం

జియ్యమ్మవలస: మండలంలోని బీజేపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థి లీలాగౌతమ్‌కు జిల్లాస్థాయి పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రథమస్థానం వచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు వి.రఘురామరాజు తెలిపారు. లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ కౌశల్ క్విజ్‌లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎంఆర్‌నగర్ ఉన్నతపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీఈఓ ప్రేమ్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రంతో పాటు రూ.6వేల ప్రైజ్ మనీ అందుకున్నట్లు చెప్పారు.



డీఈవో ప్రేమ్‌కుమార్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థి లీలా గౌతమ్

108 అంబులెన్స్‌ల పరిశీలన



అంబులెన్స్ రికార్డులు పరిశీలిస్తున్న ఏఈఎంఎస్ విజయ్‌కుమార్

సీతంపేట: సీతంపేట మండల కేంద్రంలో 108 అంబులెన్స్‌లను అరబిందో ఏఈఎంఎస్ విజయకుమార్ బుధవారం పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అంబులెన్స్ లోపల ఉన్న పరికరాలను చూసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఈఎంటీ రవిబాబు, పైలెట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి చూపించాలి

భామిని: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యార్థుల అభ్యసన విధానాలు పెంచాలని ఎంపీడీఓ, దత్తత అధికారి జె.ఉమామహేశ్వరి, కార్యదర్శి విశ్వేశ్వరరావులు సూచించారు. ఈ మేరకు బుధవారం వారు గురుకులంలోని ఆరు, ఏడు, ఎనిమిది తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ నెల24న ప్రత్యేక ప్రవేశ పరీక్ష రాయించి వారి గ్రేడ్‌లు గుర్తించాలన్నారు. అనంతరంమూడు విభాగాలుగా విద్యార్థులను విభజించి వారంతా సమాన స్థాయికి చేరేవరకు బోధనాంశాలు నేర్పించాలని చెప్పారు. ఈ మేరకు బోధన సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థులకు అవగాహన కలిగే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఇకపై ప్రతి వారం సమీక్షించనున్నట్లు స్పష్టం చేశారు.



గురుకుల విద్యార్థులకు సూచనలు చేస్తున్న దత్తత అధికారి ఉమామహేశ్వరి, విశ్వేశ్వరరావులు

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

గరుగుబిల్లి: జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడులు అన్నారు. ఈ మేరకు వారు బుధవారం మండలంలోని మరుపెంట పంచాయతీ గొల్లవానివలస గ్రామంలోని జగనన్న కాలనీలో బోర్‌వెల్ తీసేందుకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన వారికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలను మంజూరు చేసిందని, గతంలో మాదిరిగా కాకుండా జగనన్న కాలనీ పేరుతో ఊళ్లు నిర్మిస్తోందన్నారు. ఇంటి నిర్మాణాలకు అవసరమైన బోర్లు, రహదారులు, కాలువలు, విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు గృహ నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ రామారావు

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు చేస్తున్న పీవో కల్పనాకుమారి

సీతంపేట: సీతంపేట, వీరఘట్టం, భామిని ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు స్థానిక ఐటీడీఏలో ఐటీడీఏ పీవో కల్పనాకుమారి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 17 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వడంతో అందులో 16 ఉద్యోగాలకు 44 మంది దరఖాస్తు చేసుకోగా వారికి ఇంటర్వ్యూలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాలకొండ ఆర్డీవో లావణ్య, డీఎంహెచ్‌వో జగన్నాథరావు, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పూతికవలస ఆశ్రమపాఠశాల తనిఖీ

సీతంపేట: పూతికవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాలను డిప్యూటీఈవో ఎ.లిల్లీరాణి బుధవారం వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టీలను పరిశీలించారు. ఉపాధ్యాయుల లెస్సన్ ప్లాన్, టీచింగ్ డైరీలు తనిఖీ చేశారు. విద్యార్థులు ఎలా చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో లిల్లీరాణి

ప్రాధాన్య భవనాల నిర్మాణం

భామిని: గ్రామాల్లో అత్యంత అవసరమైన ప్రాధాన్య భవనాల నిర్మాణం, ప్రభుత్వ గృహాల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, హౌసింగ్ ఏఈ చంద్రశేఖరనాయుడులు సూచించారు. ఈ మేరకు బుధవారం వారు భామిని మండల పరిషత్ కార్యాలయంలో వీఈఓలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ముఖ్యమైన సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, జగనన్న కాలనీ, పీఓఏఓలు పూర్తి చేయించాలని సూచించారు. కలెక్టర్ ఇచ్చిన టార్గెట్ ప్రకారం జగనన్న కాలనీలోని 13 లేఅవుట్లలో 329 గృహ నిర్మాణాలు పూర్తి చేయడంపై చర్చించారు. ప్రాధాన్య భవనాల నిర్మాణానికి తగినట్లు వీహెచ్‌ఆర్‌ల మేరకు బిల్లులు చెల్లింపు చేపట్టాలని, నిర్మాణాలకు తగిన సిమెంట్ అందజేయాలని వీఈఓలు సమావేశంలో కోరారు. సమావేశంలో కార్యదర్శి విశ్వేశ్వరరావు, వీఈఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరి

డయల్ యువర్ డీపీటీఓకు ఆరు వినతులు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమానికి ఆరు వినతులు వచ్చినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి టీవీఎస్ సుదాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్లికోట నుంచి పార్వతీపురం వయా కొమరాడ స్కూల్ పిల్లలకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని కొమరాడ మండలం నుంచి వినతిపత్రం వచ్చిందని చెప్పారు. 3 స్టాప్ సర్వీసుకు సీతానగరంలో స్టాప్ ఏర్పాటు చేయాలని, అజ్జాడ గ్రామానికి అదనంగా మధ్యాహ్నం 2 గంటలకు బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని సీతానగరం మండలం నుంచి వినతి వచ్చిందన్నారు. విశాఖపట్నానికి బస్సు సర్వీసులు పెంచాలని, పార్వతీపురం నుంచి బత్తిలి వయా గుమ్మలక్ష్మీపురం బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని గుమ్మలక్ష్మీపురం నుంచి వినతులు వచ్చాయన్నారు. తోటపల్లి హైస్కూల్ నుంచి గిజబ, సింగనాపురం వెళ్లే విద్యార్థులకు సాయంత్రం సమయంలో తోటపల్లిలో బస్సు ఆపాలని తోటపల్లి నుంచి, పార్వతీపురం నుంచి ఉదయపురం, జి.శివడ గ్రామాలకు బస్సు ఏర్పాటు చేయాలని, లగేజీ ఉన్నప్పుడు కొంతమంది సిబ్బంది అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. బలిజిపేట మండల కేంద్రం నుంచి బొబ్బిలి, విశాఖపట్నానికి బస్సులు ఏర్పాటు చేయాని వినతి వచ్చినట్లు వివరించారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

గుమ్మలక్ష్మీపురం: మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా వేతన రూపంలో రూ.16.1 కోట్లు, మెటీరియల్స్ రూపంలో రూ.2.60 కోట్లతో చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఏపీఓ శివరామకృష్ణ తెలిపారు. ఈ మేరకు సామాజిక తనిఖీ బృందాలు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సంబంధిత రికార్డులను ఉపాధి హామీ పథకం సిబ్బంది నుంచి స్వీకరించారు. తనిఖీ బృందాలు గురువారం నుంచి ఆయా గ్రామ పంచాయతీలకు చేరుకుని 2024 జనవరి 9వ తేదీ వరకు తనిఖీలు నిర్వహిస్తారని ఏపీఓ పేర్కొన్నారు.



గ్రామపంచాయతీల్లో సామాజిక తనిఖీకి సిద్ధం అవుతున్న బృందాలు

ప్రేమానురాగాలతో మెలగాలి

గుమ్మలక్ష్మీపురం: కుల, మతాలకతీతంగా అందరూ ప్రేమానురాగాలతో మెలగాలని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రానున్న క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని బుధవారం ఐటీఐ వద్ద విద్యార్థులు, సిబ్బంది క్రిస్మస్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో ప్రతి ఒక్కరూ ప్రేమానురాగాలు కలిగి ఉండి ఒకరికొకరు గౌరవమర్యాదలు ఇచ్చుకోవాలని విద్యార్థులకు ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో స్కిల్ సెంటర్ ట్రైనీ విజయ్‌కుమార్, ఇతర సిబ్బంది ఉన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో భాగంగా భద్రగిరి ప్రభుత్వ ఆర్ ఐటీఐ వద్ద కేక్ కట్ చేస్తున్న దృశ్యం

పంపిణీకి సిద్ధంగా సంపూర్ణ పోషకాహార కిట్‌లు

సీతానగరం: మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్‌లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఎంఈఓ1 జి.సూరిదేముడు అన్నారు. ఈ మేరకు బుధవారం వివిధ గ్రామాల్లో పని చేస్తున్న అంగన్వాడీ కేంద్రాలను ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఏంఈఓ–1, ఎంఈఓ–2 జి సూరిదేముడు, ఎంపీ రమణ, ఐసీడిఎస్ సూపర్ వైజర్ పూర్ణిమలు పరిశీలించి పౌష్టికాహారం పంపిణీని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీతానగరం అంగన్వాడీ కేంద్రంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద అసంపూర్తిగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కోరుతూ ఈ నెల 12 నుంచి చేస్తున్న నిరవధిక సమ్మె కారణంగా మూతపడిన అంగన్వాడీ కేంద్రాలను పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఐసీడీఎస్ అధికార, సిబ్బంది ఆధ్వర్యంలో కేంద్రాలు తెరిచి పిల్లల ఆకలి తీర్చడానికి పౌష్టికాహారం ప్రతిరోజూ పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల స్థానంలో అర్హత కలిగిన వలంటీర్లను నియమించి సెంటర్లను తెరిపించి పౌష్టికాహారం అందించనున్నట్లు తెలిపారు. అలాగే కొంతమంది అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి కేంద్రం తాళాలు ఇవ్వక పోవడంతో కొంతవరకు అసౌకర్యానికి గురి కావలసి వచ్చిందన్నారు.

దాతల సహకారంతో విగ్రహాల ఏర్పాటు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో దాతల సహకారంతో విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం డి.రవికుమార్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన తెర్లి సూర్యనారాయణ సరస్వతి దేవి విగ్రహాన్ని, ఆర్. అనంతరావు బుద్ధుడు విగ్రహాన్ని పాఠశాలలో ఏర్పాటు చేశారని చెబుతూ ఆ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. పాఠశాలలో పూలమొక్కలను పెంచడంతోపాటు విగ్రహాలను ఏర్పాటు చేయడం వల్ల మరింత ఆకర్షణీయంగా తమ పాఠశాల తయారైందని హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన ఉండాలి

పాలకొండరూరల్: అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు నీటిని జల్లి నిరోధించాలని సూచించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

- ఎంపీపీ శెట్టి పద్మావతి

కురుపాం:

రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె కురుపాం రైతు భరోసా కేంద్రం–1లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి కొనుగోలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం 750 బస్తాలను కొనుగోలు చేసి ట్రక్‌షీట్‌లను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గార్ల సుజాత, వ్యవసాయశాఖ ఏడీఏ నిర్మల్ జ్యోతి, ఎంపీటీసీ టీవీ ఎస్. సోమయాజులు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకోట వెంకట సురేష్‌కుమార్, ఆర్బీకే సిబ్బంది మౌనిక, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంలో భాగంగా రైతులకు ట్రక్ షీట్‌ను అందిస్తున్న ఎంపీపీ శెట్టి పద్మావతి

జోరుగా ఖరీఫ్ ధాన్యం సేకరణ



గురండి రైస్ మిల్లు వద్ద బారులు తీరిన ధాన్యం లోళ్లు



కోత యంత్రాలతో ముమ్మరంగా ధాన్యం సేకరణ

భామిని: మండలంలో ఖరీఫ్ ధాన్యం సేకరణ జోరుగా సాగుతోంది. ఇప్పటికే మొదటి విడత రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరిగిపోవడంతో రైతులు మరింత ఉత్సాహంతో ధాన్యం సిద్ధం చేసి ఆర్‌బీకేల ద్వారా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు.ముందస్తుగా ఆర్‌బీకేల వద్ద శాంపిల్స్‌లో తేమశాతం గుర్తించి ట్రక్ షీట్‌లు సిద్ధం చేసి పంపుతున్నారు. భామిని మండలంలోని రైస్ మిల్లులకు స్థానిక రైతుల నుంచి సేకరించిన ధాన్యమే అప్పగించడంతో రైతుకు ఊరట కలిగింది. పొలాల్లోని వరిచేలను కోత యంత్రాలతో రాత్రింబవళ్లు కోత కోసి సేకరిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కురుపాం: వాహన చోదకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని కురుపాం ఎస్సై షణ్ముఖరావు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం కురుపాం మండల కేంద్రంలోని రావాడ కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహన చోదకులు, ఆటోవాలాలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతి వాహన చోదకుడు తప్పనిసరిగా లైసెన్స్, ఇన్‌స్రూ సీబుక్ కలిగి ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధించారు. ఈ వాహన తనిఖీల్లో హెచ్‌సీ దొర, కానిస్టేబుల్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.



కురుపాం మండల కేంద్రంలో వాహన తనిఖీలు చేపడుతున్న ఎస్సై షణ్ముఖరావు